420) శ్రీ

ప॥ అల్పశక్తివాడ నేను ఆదిశక్తివి నీవు। పోల్ప నెంతపనికి బూనితివయ్యా॥

చ॥ నీపదధ్యానములోనే నిండెను నామనసెల్ల। యేపున నీసాకార మేమిటి భావింతునయ్య।
చూపు నీసింగారమందే చొక్కి తగులాయ నిదె। ఆపి నే నీయంగకాంతుల జూతునయ్య॥

చ॥ నాలుక నీకడలేనినామములే నుడిగీని। మేలిమి నీగుణము లేమిట బొగుడుదునయ్య।
గాలివంటివీనులు నీకథల దనిసెనయ్య। యీలీల నీయనంతమహిమ యెందు విందునయ్య॥

చ॥ నీకు శరణని యిట్టె నే ధన్యుడనైతి। యీకడ నీసేవసేసి యేమి గట్టుకొందునయ్య।
శ్రీకాంతుడవైనశ్రీవేంకటేశ నీకు। వూకొన నాజన్మఫల మొకమొక్కు చాలునయ్య॥